

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 19 ఆగస్టు, 2022 సంచిక : 3

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**
**శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)**
**ప్రచార సారథ్యం :**
**శ్రీ బి. గోపీకృష్ణ**
**శ్రీమతి బులుసు జయ**

**సాయివాణి చందా వివరాలు**
ద్వైవార్షిక చందా. ......... రూ॥ 200/-
ఆజీవ సభ్యత్వం .......... రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
**సాయిధామం, బొమ్మల రామవరం మండలం,**
**యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.**
**Ph : 9440413455, 9848133565**

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .................................... 2
బాలవాణి-చల్లని తల్లి .................... 4
వృద్ధాశ్రమం .................................. 18
సాయి సేవక్-శ్రీ శివనేశన్ .......... 19
శాశ్వత ధర్మగోప్త ........................ 22
సాయిభక్త దాసగణు ...................... 25
శ్రీ సాయి నిత్య పారాయణ .......... 27
మాతృసంస్థ కబుర్లు ...................... 29


ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







## మా వాణి



సాయిభక్తులందరికీ సాదర మనస్సులు,

మిత్రులారా!

భారతీయ సంస్కృతిలో సత్సంగానికి గొప్ప స్థానం ఉంది. ఆధ్యాత్మిక విలువలు పెంచుకోవడానికి మాత్రమే కాక సామాజిక స్పృహ కలగడానికీ గ్రామంలో సమైక్య భావన కలగడానికీ కూడా ఇవి ఎంతగానో ఉపకరించేవి. ఆ రోజుల్లో పనిపాటలు చేసుకునే పాఠక జనం, చిన్న పిల్లలు స్త్రీలు కూడా ఎక్కువగా సత్సంగాలకు వచ్చేవారు కాదు. కానీ, హరికథలు, పురాణాలు, బుర్రకథలు, వీధి భాగవతాలు, నాట్యాలు, నాటకాలు, ఒగ్గు కథలు, దేవాలయోత్సవాలలో జరిగే ప్రవచనాలు - వీటన్నింటి ద్వారా ఎంతో జ్ఞానం వారందరికీ లభించేది. కనుక సత్సంగాల వలన కలిగే ఫలితం అంతా కాస్త అటు ఇటుగా మిగిలిన వారికి కూడా దొరికేది. ఇంకా లోతులకు వెళ్లదలుచుకున్న భక్తులు గురువుల చెంత సత్సంగాలలో పాల్గొని లబ్ధి పొందేవారు.

కాలగతిలో మన కళారూపాలు, సంస్కృతీ సంప్రదాయాలు-ప్రతీది మార్పు చెందుతూ వచ్చాయి. పైన చెప్పుకున్న కళారూపాలన్నీ మాయమై వాటన్నిటి సమ్మేళనంగా సినిమా వచ్చింది. ఆదికాలంలో ఇందులో కూడా చాలా చక్కని ప్రయోజనాత్మకమైన పౌరాణిక, ఐతిహాసిక చిత్రాలు దేశ భక్తిని ప్రేరేపించేవి. భారతీయ సమాజాన్నీ, దాని తీరుతెన్నులను, సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే చిత్రాలు ఎన్నో వచ్చాయి. యోగి వేమన, భక్త పోతన, మాలపల్లి - రైతుబిడ్డ, సత్య హరిశ్చంద్ర లాంటి చిత్రాలు చూసి ఎందరో ప్రభావితులైన ఉదాహరణలు ఉన్నాయి. విదేశీ విద్య ఆ సంస్కృతీ

ప్రభావం పడటంతో వీటి నడక మారిపోయింది. ముక్కోణపు ప్రేమలు, మూకుమ్మడి దొమ్మీలు, అర్థం పర్థం లేని సంభాషణలు, తలా తోకా లేని పాత్ర చిత్రణ, అర్ధనగ్నపు వేషాలు- మనం ఎటు పోతున్నామో అర్థం కాక పెద్దవాళ్ళు తలకొట్టుకుంటుంటే - పిల్లలు, యువకులు సినిమా సంస్కృతినే జీవితాలలోకి ఆహ్వానించుకొని మైమరచిపోతున్నారు.

దీనికి తోడు నగరాలలో ఆకాశహర్మ్యాల సంస్కృతి ప్రబలంగా పెరిగి పోయింది. మూడో వాటాలో ఏం ప్రమాదం జరిగిందో, ఐదో వాటా వాడికి తెలియదు. మొదటి వాటాలో ఉత్సవం జరిగితే నాలుగో వాటా వాడికి ఆహ్వానం ఉండదు. ఒకే కప్పు క్రింద బ్రతికే వాళ్ళ అనుబంధాలే ఇంత సొంపుగా ఉంటే ఇక విడివిడి భవనాల వారి మాట చెప్పేదేముంది? ఈ విష-పోనీ విషమ సంస్కృతిని సరిచేయాలంటే చిన్న చిన్న సమావేశాలు, తరచుగా కలుసుకోవడాలు ఎంతో అవసరం, అలా కలుసుకోవడానికి సత్సంగాలు చక్కని మార్గం.

ఇక మన సంతానం దగ్గరికి వస్తే-వాళ్ళకు మన జాతి గొప్పతనం గురించి కాని, మన పూర్వుల ఘనతను గురించి కాని చెప్పే దిక్కు ఎవ్వరూ లేకుండా పోయారు. పాఠశాలలు పెద్ద వ్యాపార కేంద్రాలు కాగా పిల్లలకు మంచి ముక్కలు చెప్పడానికీ ఇళ్ళల్లో బామ్మలో, తాతలో లేకుండా మన మినీ ఫ్యామిలీ కల్చర్ చేసేసింది. ఒకవేళ ఏ కొంపలోనైన ఒకరిద్దరు వృద్ధులు ఉన్నా వారు కూడా టి.వి. సీరియల్స్ చెప్పేలా ఉన్నారు.

మనసు ఏలిన వారి పరమ పవిత్రమైన పాఠ్యగ్రంథాలలో అచ్చమైన చరిత్ర ఉండదు. సరియైన జీవన చిత్రణ ఉండదు. వీటినన్నింటిని సరి చేసుకోవడానికిగానీ, మన పిల్లలలో ఆరోగ్యవంతమైన ఆలోచనలను, విజ్ఞతను, దేశభక్తినీ పెంపొందించడానికిగానీ బాల సత్సంగాలు చాలా అవసరం. సాయిధామం ఆశ్రమం వారు బాల సత్సంగ శాఖలను ఎన్నింటినో నడిపారు. ఇంకా కొత్త శాఖలను ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నారు





కూడా.

ప్రియ మిత్రులారా, పనికిమాలిన ఎన్నెన్నో విషయాలకు ఎంతో సమయాన్ని వృధా చేస్తుంటాం. అలంకరణ కోసం, సినిమాల కోసం, చెత్త పత్రికల కోసం చౌరస్తాలో నిలబడి అడ్డమైన గాసిప్‌లు చర్చించడం కోసం, ఇంకా ఇతర ప్రయోజనాల కోసం ఎంతోకాలాన్ని వెచ్చిస్తుంటాం. మరి అలాంటిది మరి మన ఆత్మవిశ్వాసం కోసం, మన బిడ్డల అభ్యున్నతి కోసం వారంలో ఒక గంట కూడా ఉపయోగించుకోలేమా? ఆలోచించండి. మీ ఇంట్లోగానీ, మీ వీధిలోగానీ, మీ చేరువలోని దేవాలయంలోగానీ మీరు సత్సంగ కేంద్రాలు ప్రారంభించుకోండి. ఈ విషయంలో ఏ విధమైన సహకారం కావలసి వచ్చినా "సాయి వాణి"కి ఫోన్ చేయండి.

బాలవాణి

## చల్లని తల్లి

నేలతల్లీ, నింగిఱేడూ చెలిమి చేసే తోటలో -
జిలుగు మబ్బుల పలుకరించే నీలికొండల కోటలో -
దాచుకొన్నది ప్రకృతి సుందరి తనదు బంగరు మూటలు!
దోచుకున్నా కొంచెమైనా తరగవా సిరి పంటలు!
ముదురు పచ్చని గుబురు మొక్కలు మింటికెగసే తరువులు,
వంగి ఊయలలూగు తీగెలు, రంగు రంగుల పూవులు
ఈలవేసే పిల్లగాలులు, నిలువ-చల్లని నీడలు,
నాట్యమాడే భ్రమరబాలలు, పాటలాపని పికములు .......
ఇంత సంపద ప్రోగుజేరెను వింతగా చిట్టడవిలో!
ఎంత దీసిన తరుగునా రవ్వంత - ఆ నట్టడవిలో? ........
ప్రొద్దు పడమరకు తిరిగింది.
ఆ నట్టడవి చిట్టడవిలో - లయ తప్పకుండా గొడ్డళ్ళ మ్రోత వినిపిస్తోంది.

పొదరిండ్ల చల్లని నీడలలో 'తుర్రు'మని అటూ యిటూ తిరుగాడుతూ - పిచ్చుకలు, గోరువంకలు, పూరేళ్ళు మొదలైన అడవి పిట్టలు రకరకాలుగా ధ్వని చేస్తున్నాయి. నెత్తిమాడే ఎండ, వేడిగాల్పులు, చురుక్కుమని సూదుల్లా పొడిచే ఆ ఎండలో ఒక కట్టెలమ్మేవాడు తాను కొట్టిన కట్టెలను ప్రోగు వేసుకుని మోపుగట్టుకుంటున్నాడు. నల్లరాయిలా గట్టిగా వున్న అతడి ఒంటి మీద నీళ్ళు కుమ్మరించినట్టు చెమటకారుతోంది. అతడు ఆ అడవిలో వున్న ఆనందాన్ని అనుభవించడం లేదు. ఉయ్యాలలూగే తీగెలు, రంగు రంగుల పువ్వులు, నాట్యమాడే తుమ్మెదలు, పాటలు పాడే కోయిలలు- యివేవీ అతన్ని ఆకర్షించడం లేదు. ఈ అందాల సంపదను దోచుకోవ డానికి అతను రాలేదు. అతడు కట్టెల కోసం వచ్చాడు. వాటిని పట్టణంలో అమ్మి, ఆ డబ్బుతో ఆ రోజు సంసారం గడుపుకుంటాడు.

ఉదయం నుంచి కట్టెలు కొట్టి అతడు బాగా అలసిపోయాడు. నాలుక తడి ఆరిపోయింది. దాహం వేస్తూ ఉంది. కొండవాగు అక్కడికి చాలా దూరం. అతడు కట్టెల మోపు కట్టుకున్నాడు. గొడ్డలిని మోపులోనే చెక్కాడు. దేవదారు చెట్టు నీడలో కాస్సేపు విశ్రమించాడు. లేచి, మోపు నెత్తిన పెట్టుకున్నాడు. చేతిలో మరొక లావుపాటి కట్టె పట్టుకున్నాడు. గసలుబోస్తూ, వడివడిగా నడక సాగించాడు.

చిట్టడవి దాటుకొన్నాడు. కొండ మలుపు తిరిగాడు. దూరంగా - భూదేవి కట్టిన చీరె గాలికి రెపరెపలాడినట్లు- పైరు పచ్చలు అటు ఇటు చిన్నగా కదులుతూ కనిపిస్తున్నాయి. కొండ మలుపులో - దారి ప్రక్కన- ఒక చిన్న పర్ణశాల ఉంది. దానికొక ప్రక్క రెండు నేరేడు చెట్లూ, మరొక ప్రక్క ఒక మామిడి చెట్టు ఉన్నాయి. చుట్టూ గుబురుగా క్రిక్కిరిసి ఏవేవో పొదలున్నాయి.

అతడు తన కట్టెల మోపును నేరేడు చెట్టు బోదెకు ఆన్చి, పచ్చిక పైన నీడలో చతికిలబడి - "ముసలమ్మా!" అన్నాడు. ఆ ఇంట్లోంచి ఒక ముస





లామె బయటికి వచ్చింది. ఆమె ముంతనిండుగా అతడికి మంచి నీళ్ళిచ్చింది. అతడు గబగబ త్రాగేశాడు. ప్రాణం కుదుటపడినట్లైంది. తన చేతిలో ఉన్న లావాటి కర్రను ఆమె ముందు పడేశాడు. "ఎందుకులే రాముడూ? ఇది లేకపోతేనేం? వున్న కట్టెలు ఎలా కాల్చుకోడమో తెలీడం లేదు, వొద్దంటున్నా వినక - లేనిపోని కష్టం పెట్టుకుంటావు" అంది ముసలామె.

"అయ్యో చల్లని తల్లీ! అలా అనకు కట్టెలమ్ముకునే వాళ్ళంతా జన్మజన్మ లకూ నీ ఋణం తీర్చుకోలేరు. నీ చల్లని చేతినీళ్ళు త్రాగుతూ - నీ ఇంట్లో ఒక కట్టె అయినా తెచ్చి పడేసి పోకపోతే మా కట్టెలు ఉంటేనేం, లేకపోతేనేం ...... " అన్నాడు రాముడు.

సేదతీరిన తర్వాత - మోపు నెత్తిన బెట్టుకుని రాముడు తన దారిన తాను వెళ్ళిపోయాడు. మరికాస్సేపటికి - అక్కడికి ఒక్కొక్కరే చాలామంది కట్టెల వాళ్ళు వచ్చారు. వచ్చిన ప్రతివాళ్ళూ ముసలమ్మ చేతినీళ్ళు త్రాగి 'అమ్మయ్య' అనుకుని, తలా ఒక్కొక్క కట్టె అక్కడ పడేసి వెళ్ళిపోయారు.

సాయంకాలమైంది. కట్టెలమ్ముకునే వాళ్ళంతా వెళ్ళిపోయారు. ఆ ఆకుటిల్లు ముందర ఒక మోపు కట్టెలు ప్రోగైనాయి. ఆమె వాటిని తీసుకెళ్ళి ఇంట్లో వేసి ఉన్న కట్టెల మీద తన పుణ్యంలా పేర్చుకొంది.

ఆమె పేరేమోగానీ అందరూ ఆమెను 'ముసలమ్మా' అనే అంటారు. ఆమెకు ఎవ్వరూ లేరు. ఆ అడవి బయట, కొండ కింద ఇల్లు కట్టుకొని ఆమె ఒక్కతే ఉంటోంది. ముసలమ్మ ఆ అడవిలోని పళ్ళ రకాలంతా కోసి బుట్ట నింపుకుని పట్టణానికి వెళ్ళి అమ్ముతుంది. వచ్చిన పైకంతో భత్యం కొనుక్కుంటుంది.

ఆ ముసలమ్మది చల్లని గుండె. ఆమె ఇంటికి దగ్గరలో ఎక్కడా నీళ్ళు దొరకవు. అరమైలు దూరంలో ఒక చిన్న మడుగు ఉంది. ముసలమ్మ అక్కడి నుండి నీళ్ళు తెచ్చుకుంటుంది. కట్టెలు కొట్టేవాళ్ళు అడవిలో నుంచి

మోపులు నెత్తిన బెట్టుకుని దాహంతో వస్తారక్కడికి. ఆమె లేదనకుండా వాళ్ళకు కావలసినంత నీళ్ళిస్తుంది. వాళ్ళు తలొక కర్ర ఆమె ఇంటి ముందు పడేసి పోతుంటారు. ఆమె వద్దన్నా వాళ్ళు వినరు. మనస్సులో ఆమెను మెచ్చుకోకుండా ఉండలేరు. ముసలమ్మ ఆ కట్టెలన్నీ పేర్చింది. చిన్న గుట్ట తయారైంది. వాటిని ఏం చేయాలో ఆమెకు తోచలేదు.

✡ ✡ ✡ ✡

ఆ మరునాటి ఉదయం ముసలమ్మ మడుగు నుండి రెండు కడవల నీళ్ళు తెచ్చుకున్నది. ఆమె ఇంటి ముందు నుండి ఒక రెండెడ్ల బండి సాగి పోయి, కొండ ప్రక్కన నిలబడింది. ఆ బండిలో ముగ్గురు మనుషులున్నారు. "ఏం నాయనా? కట్టెల కోసమా?" అని అడిగింది ముసలమ్మ. ఆ ముగ్గురిలో ఒక కోరమీసాలాయన - "కాదమ్మా పూరి గడ్డి కోసం. వానా కాలం దగ్గర కొచ్చేసింది కదా ఇల్లు కప్పకోవాలి" అన్నాడు.

మధ్యాహ్నం అయింది.

వాళ్ళు ముగ్గురూ ముసలమ్మ ఇంటి ముందు నిలబడ్డారు. చాలా అలసిపోయి ఉన్నారు. మొహాలు ఈడ్చుకుపోయాయి. శరీరాలు చెమటతో తడిసిపోయాయి. కన్నుల్లో ఆకలి తొంగిచూస్తోంది. వాళ్ళు ఆమెను కొంచెం మంచి నీళ్ళిమ్మన్నారు.

"ఏం బాబూ అన్నాలు తిన్నారా?" అంది ముసలామె.

"లేదవ్వా! అన్నాలేమో తెచ్చుకున్నాం అజాగ్రత్త వల్ల కాకులపాలై పోయింది" అన్నాడు మీసాలాయన.

ముసలమ్మ నొచ్చుకుంది. "అయ్యో! తండ్రుల్లారా ఆకలితో ఎలా ఉంటారు? ఇంట్లో అన్నమైనా లేదు. కాస్సేపుండండి, వండి పెడతాను" అంటూ వారు వద్దంటున్నా వినిపించుకోకుండా పొయ్యి మీద ఎసరు పెట్టింది. నూకలు వేసి సంగటి చేసింది. దగ్గరలో ఉన్న చింతచెట్టువి నాలుగు చింతకాయలు కోసి పచ్చడి చేసింది. ఆ ముగ్గురు పరమానంద





భరితులయ్యారు.

ఆ నూకల సంగటిని చింతకాయ పచ్చడితో అద్దుకుని అమృతంలా తిన్నారు. "తల్లీ! నువ్వు నూరేండ్లు చల్లగా ఉండాలి. మా ప్రాణాలు నిలిపావు" అన్నారు. ఆ ముసలాయన తన మొలలోంచి చిల్లర డబ్బులు తీసి ఆమె కివ్వబోయాడు. ఆమె వద్దంది. "నేను డబ్బుకు అన్నం పెట్టాననుకున్నారా బాబూ? పాపం మీరు ఆకలితో ఉన్నారు కదా! అని పెట్టానంతే! అంత మాత్రానికి డబ్బెందుకు?" అంది. "నీ ఋణం మాకెందుకవ్వా? ఉంచుకో ఫరవాలేదు" అంటూ బలవంతం చేశాడు మీసాలాయన. ఆమె పుచ్చుకోలేదు. "నీకు అంతగా ఋణం ఉంచుకోకూడదని ఉంటే నాకో సాయం చేసి పెడ్తావా నాయనా?" అంది.

"ఏం?" అన్నాడు అతను.

"మరేమీ లేదు. నీ పనులన్నీ చక్కబడ్డాక ఒక నెలరోజుల తర్వాత ఎప్పడైనా నీ రెండెడ్ల బండిని తీసుకొస్తావా? నీ కష్టం నేను పెట్టుకోనులే" అంది ముసలమ్మ.

సరేనన్నాడు అతడు. "అవ్వా నిన్ను మరచిపోను. నా పేరు మీసాలయ్యా నాకు వీలున్నప్పడు తప్పక బండి తెస్తాను".

అడవీ, కొండా అంతా గాలించి మీసాలయ్య పూరి గడ్డితో బండిని నింపేసి, సాయంకాలం కాగానే తన అనుచరులతో ఇంటి ముఖం పట్టాడు.

✡ ✡ ✡ ✡

ఒక నెలరోజులు గడచిపోయాయి. వర్షాకాలం ప్రారంభమైంది. రోజూ ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. ఎక్కడ చూచినా వాగులు పొర్లి ప్రవహిస్తున్నాయి. అడవంతా పచ్చగా చిగురిస్తోంది. ఎవ్వరూ కట్టెల కోసం రావడం లేదు. ఎంత గాలించినా ఆ వానల్లో అడవిలో ఒక ఎండు పుల్ల దొరకడం కష్టం.

ఆ రోజు తెల్లవారింది. రాత్రంతా వాన కురవడం మూలాన నేలంతా

తడిసిపోయి అక్కడక్కడ బురదబురదగా ఉంది. నేరేడు చెట్లూ, మామిడి చెట్లూ పచ్చగా కదులుతున్నాయి. ఆకాశం స్వచ్ఛంగా కడిగివేసిన అద్దంలా ఉంది. తెల్లటి పొగమంచు దూదిపింజల్లా విచ్చిపోతూ కొండశిఖరం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూంది. కోయిల గొంతులో కొత్త రాగం వచ్చింది. సూర్యకిరణాల వెలుగులో ప్రకృతి నవనవలాడుతూ చైతన్యవంతంగా ఉంది.

ఆ సమయంలో ఆమె ఇంటి ముందు ఒక రెండెడ్ల బండి ఆగింది. మీసాలయ్య క్రిందకి దిగి "ముసలమ్మా! బండి తెచ్చాను" అన్నాడు. ఆమె సంతోషంతో అతన్ని పరామర్శించింది. గబగబ అన్నం వండి, అతనికి పెట్టి తానూ తిన్నది. అతని సహాయంతో ఇంటిలోని కట్టెలన్నీ బండిలోకి చేరవేసింది.

బండి నిండిపోయి, సగం కట్టెలు ఇంట్లోనే మిగిలిపోయాయి. కట్టెలు పడిపోకుండా కట్టుదిట్టంగా కట్టేశాడు మీసాలయ్య. "ఈ కట్టెలన్నీ పట్టణంలో అమ్ముకోవాలి నాయనా" అంది ముసలమ్మ.

సూర్యుడు నడినెత్తి మీద నిలిచే సరికి ఇద్దరూ బండి మీద బయలుదేరారు.

సాయంకాలం కాబోతున్నది. పట్టణం సమీపానికి వచ్చారు. ఇంతలో సన్నగా రాలుతూ ఉండిన తుంపర ఎక్కువై, వాన జోరు హెచ్చింది. బాటకు ప్రక్కగా ఊడలతో దట్టంగా ఒక మర్రిచెట్టుంది. బండిని దాని క్రింద నిలిపారు. వాన జోరుగా కురుస్తోంది. మర్రిచెట్లో ఆగిపోయిన చిలుకలు కీచుకీచుమంటున్నాయి. మర్రి ఆకుల్లో నుండి నీటిబొట్లు టపటపమని జారిపడుతున్నాయి. ఆ మర్రిచెట్టు కింద అంతకుముందే మరో వ్యక్తి నిలబడి ఉన్నాడు.

"ముసలమ్మా అసలే వానాకాలం, పంటచెరకు దొరకడం కష్టం. నీ కట్టెలకు మంచిధర తగిలి తీరాలి" అన్నాడు ముసలయ్య.



సాయి వాణి

అక్కడున్న అపరిచిత వ్యక్తి ఆ ఇద్దరినీ చూచాడు. బండిలో ఎత్తుగా కట్టిఉన్న కట్టెలను చూశాడు. "ఎక్కడ నుండి వస్తున్నారమ్మా?" అని పలకరించాడు.

అతడు పెద్ద తలపాగా కట్టుకున్నాడు. గోచికట్టు కట్టుకున్నాడు. తెల్లని శాలువాను ఒంటిపైన కప్పుకున్నాడు. అతని చేతిలో ఒక పొడుగాటి బడితె కర్ర ఉంది. అతని బుర్రమీసాలు నల్లగా వంపులు తిరిగి ఉన్నాయి. చెవుల్లో కుండలాలు వ్రేలాడుతున్నాయి. ఒత్తైన కనుబొమ్మల క్రింద కన్నుల్లో మనుషుల్ని ఆకర్షించే తేజస్సు ఏదో కనిపిస్తుంది.

"నాకు ఊరూ లేదు, పేరూ లేదు బాబూ ఆ నీలికొండల దగ్గర నా ఇల్లు. పట్టణంలో కట్టెలమ్ముకుపోదామని వచ్చాను" అంది ముసలమ్మ.

ఆ వ్యక్తి ఆశ్చర్యపడ్డాడు. "ఈ వానాకాలంలో ప్రజలంతా పొయ్యిలోకి పంటచెరకు దొరక్క నానా అగచాట్లూ పడుతున్నారు, నువ్వెక్కడి నుండి తేగలిగావమ్మా ఈ ఎండుకట్టెల్ని?" అన్నాడు.

ముసలమ్మ చిన్నగా నవ్వింది. "నేనెక్కడ నుంచి తేగలను బాబూ? ఆ రాముడిచ్చాడు. రోజూ చిట్టడవిలో కట్టెలు కొట్టుకూనే వాళ్ళకు నీళ్ళిచ్చి వాళ్ళ దాహం తీర్చేదాన్ని. బదులుగా వాళ్ళు తలొక కట్టె పారేసిపోయేవారు. అవే ఇప్పటికి బండెడు కట్టెలయ్యాయి. ఇన్ని కట్టెలు నాకెలాగూ ఉపయోగపడవు. అందుచేత డబ్బు చేసుకుపోదామని వచ్చాను".

ఆ కొత్తమనిషి కళ్లు చిట్లించి కాస్సేపు ఆలోచించాడు. ముసలమ్మతో ఇలా అన్నాడు. "ఇదిగో అవ్వా వెదకబోయిన తీగ కాళ్ళకు చుట్టుకున్నట్లు ఈ సమయంలో నువ్వు కనిపించావు. నా పేరు రాజన్న. రాజుగారి కొలువులో నౌకరీ చేస్తున్నాను. వారి కోటలో పంటచెరకుకు కొరత వచ్చి పడింది. ఆ కొరతను పూడ్చేసే బాధ్యత నా నెత్తి మీద పెట్టారు రాజుగారు. ఎక్కడా ఒక్క మోపైనా కనిపించలేదు. నా పాలిట దేవతలా నువ్వు వచ్చావు. బండి తోలుకుని నా వెంట అంతఃపురానికి రా, నీకు మంచి బహుమతి

ఇప్పిస్తాను".

ముసలమ్మా, మీసాలయ్యా సంతోషించారు. "అంతా ఆ రాముడి చల్లదనం. పదండి బాబూ!" అంది ముసలమ్మ. వాన వెలిసింది. బండి రాజన్న వెంబడే కదిలింది.

సూర్యుడు పడమటి కొండ మీదికి దూకబోతున్నాడు. లేయెండ ప్రపంచం మీద పరచుకొన్నది. తూరుపు దిక్కున ఇంద్రధనుస్సు, ఆకాశరాజు భూదేవి మెడలో వేసేందుకు తెచ్చిన పూలమాలలా మెరిసిపోతూ ఉంది. ముగ్గురూ పురవీధుల్లో ప్రవేశించారు.

అవి- పట్టణం బయట బడుగు ప్రజల పూరి కొంపలు. వీధి ఇరుకుగా, అసహ్యంగా ఉంది. శుభ్రం అన్నది ఎక్కడా కనిపించదు. పిల్లలు దిగంబరులుగా తిరుగుతున్నారు. ఎదురైన ప్రతి మనిషి డొక్కా ఎండిపోయి ఉన్నది. వాన పడి ఇళ్ల పైకప్పులన్నీ తడిసిపోయాయి. వాకిళ్లలో మనుషులు నిలబడి ఉన్నారు. వర్షాన్ని ఆ ఇళ్ల పైకప్పులు అడ్డగించలేవు. కనుక వాళ్ళు కూడా తడిసిపోయి ఉన్నారు. పై కప్పల నుండి దట్టంగా తెల్లటి పొగలు పైకి లేస్తున్నాయి. ఒక ఇల్లాలు బయట నిలబడి పచ్చికట్టెను సన్నని పేళ్ళుగా చీల్చుకుంటోంది.

కట్టెల బండిని చూచి ఆ వీధిలోని వాళ్లందరూ బిలబిలమంటూ బండి చుట్టూ గుమిగూడారు. నిక్కినిక్కి కట్టెల్ని అందుకో ప్రయత్నిస్తున్నారు. "ఆగండి" అని గద్దించాడు ముసలయ్య. బండి ముందుకు కదలలేకపోయింది.

"కట్టెలు అమ్మేవేనా?"

"మాకు కొన్ని కట్టెలు కావాలి"

"బండి కట్టెలు ఎలా కొనడం?"

ఆ గుంపులో కట్టెల మీద దుమారం రేగింది.

"దూరంగా వెళ్ళండి. వీటిని ఎవరికీ అమ్మడం లేదు. ఇవి రాజుగారికి





అంటూ అదిలించాడు మీసాలయ్య".

ముసలమ్మ ఇప్పుడు సందిగ్ధావస్థలో పడింది. రాజన్నకేమో తాను మాట ఇచ్చేసింది. ఇక్కడ ఇన్ని కుటుంబాలు కట్టెల కోసం అల్లాడుతున్నాయి.

"ఒక ఇల్లాలు "అయ్యా! వంటచేసి రెండురోజులైంది. పొయ్యిలో పచ్చి పుల్లలు పెడితే పొగ వస్తోంది గాని, మంట మాత్రం పుట్టడం లేదు. పిల్లా జెల్లా అంతా తిండిలేక మాడుతున్నారు. తలకో నాలుగేసి కట్టెలిచ్చి వెళ్ళండి చాలు బతికిపోతాం" అంది దీనంగా.

ముసలమ్మ మనసు కరిగిపోయింది. ఎవరో ఆమె కడుపులో చెయ్యి పెట్టి కెలికినట్లయింది. వెంటనే మరేమీ ఆలోచించలేక బండి దిగి కట్లు విప్పింది. రాజన్న ఆమె వైపు విచిత్రంగా చూశాడు, వారించాడు "ఇదేమిటవ్వా! కట్టెలు కోటలో వేస్తానని చెప్పి ఇక్కడ అమ్ముకుంటున్నావు? ఇదేం న్యాయం?" అన్నాడు.

ముసలమ్మ నిబ్బరంగా ఇలా అంది. "న్యాయమో, అన్యాయమో నాకు తెలియదు రాజన్నా! నా మనస్సుకు ఎలా తోస్తే అదే న్యాయం. ఈ కట్టెలు నేను కష్టపడి సంపాదించినవి కావు. పేరాసలు నాకొద్దు. ఇంతమంది పేదల్ని గోడుపెట్టి నేను సుఖపడేదేముంది? రాజుగారికేం? ఆయన తలుచుకుంటే ఇంటి దూలాలు ఊడబెరికి వంట చేయించుకోగలరు. వారి ఒక్కరి కోసం ఇన్ని బీద కుటుంబాలు అన్నం లేకుండా మాడిపోవాలా? నేనూ పేదదాన్నే, నేను కోరేది పేదవాళ్ల బాగే! ఈ కట్టెలన్నీ వీళ్లకే ఇస్తాను. వీళ్లందరూ నాలుగు రోజులపాటు అన్నం వండుకు తిన్నారంటే నాకదే గొప్ప బహుమతి".

"ఈ సంగతి రాజుగారు వింటే నీగతి ఏమవుతుందో ఆలోచించావా?" అన్నాడు రాజన్న కోపంగా.

"రాజుగారు కోప్పడేంత తప్పు నేనేమీ చేయలేదే? రాజుకు కావలసింది ప్రజలసౌఖ్యమే కదా? ఆయన చేయాల్సిన పనిలో నేను కొంత పాలుపంచు

కున్నాను. రాజు మంచివాడైతే ఇందుకు నన్ను తప్పక మెచ్చుకుంటాడు" అంది ముసలమ్మ.

"సరే నీ సంగతి ఇప్పుడేముందిలే? రేపటికి గదా!" అంటూ రాజన్న పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ గబగబ రాజవీధిలోకి దారితీశాడు.

ముసలమ్మ కట్టెలన్నీ ఆ పేద ప్రజలకు పంచిపెట్టింది. వాళ్లు ఇచ్చిన వెల కొంచెమైనా దాన్ని గొప్పగా స్వీకరించింది. మీసాలయ్యకు బండి బాడుగ ఇవ్వబోయింది. అతడు నిరాకరించాడు. "నీ దగ్గర ప్రతిఫలం ఆపేక్షిస్తే పాపం చుట్టుకుంటుంది తల్లీ" అన్నాడు. "ముసలమ్మా మా చెడ్డ చిక్కు తెచ్చి పెట్టుకున్నావు గదమ్మా! రేపు ఏం ప్రమాదం వచ్చి నెత్తిన బడుతుందో?"

"ఏమైనా జరగనీ, నా తప్పు మాత్రం ఏమీ లేదు" అంది ముసలయ్య ఆమె మళ్లీ ఒంటరిగా తన కుటీరానికి వెళ్లిపోయింది.

✡ ✡ ✡ ✡

ఆ రాత్రి తెల్లవారింది. మామిడి చెట్లో కోయిల రాగమాలపించనని దిగులుగా కూర్చుంది. ముసలమ్మ నిన్న జరిగిన సంగతంతా నెమరువేసు కుంటూ తన చినికిపోయిన ఇంటి మీద ఆకులు కప్పకుంటోంది. ఉదయ కాంతులు పండిపోయిన ఆమె ముఖం మీద పడి ముసలితనపు గీతలను లెక్క పెట్టుకుంటున్నాయి.

ఎండ చురుకెక్కింది. ఇంతలో ఆమె కుటీర ప్రాంగణంలో ఒక పల్లకీ వచ్చి నిలిచింది. దాంతోబాటు ఇద్దరు బోయీలు, ఇద్దరు రాజభటులు వచ్చారు. అవ్వ వాళ్లను చూచి ఆశ్చర్యపోయింది.

"నిన్న కట్టెలమ్మిన ముసలమ్మ నీవేనా?" అని అడిగారు రాజభటులు.

"అవును" అంది ముసలమ్మ.

"అయితే పద - రాజుగారు తీసుకురమ్మన్నారు నిన్ను"

"ఎందుకు? అంది ఆమె.





"మాకు తెలియదు"

"అయితే పదండి" అంటూ ముందుకు నడిచింది ముసలమ్మ.

"నువ్వు రావాల్సిన పనిలేదు. మేమే తీసుకువెడతాం. నువ్వు పల్లకీలో కూర్చో" అన్నారు వాళ్ళు. ఆమె పల్లకీలో కూర్చుంది. పల్లకీ బోయీల భుజాల పైకెక్కి కూర్చుంది. బోయీలు కొండవాగులా ముందుకు నడకసాగించారు.

ఆ పటకుటీరం దగ్గర మాయమైన పల్లకీ రాజభవనం ముందు జిగాల్మంది. రాజభటులు ఆమెను లోపలికి తీసుకుపోయారు. ఆమె అదివర కెప్పుడూ ఆ ఆడంబరాలు, వైభవాలు చూచి ఉండలేదు. ధగధగలాడే స్తంభాలు, పలుసవాళ్ల పరచిన వసారాలు, భ్రమలుగొల్పే లోహ శిల్పాలు, అడుగడుగునా పరచి ఉన్న పట్టు తివాసీలు, భవన నిర్మాణంలో ప్రతి అంగుళంలోనూ కనిపించే నగిషీలు ఆడంబరంగా తిరుగాడే దాసదాసీ జనాలు. వీటినంతా చూచి ముసలమ్మ అబ్బురపడింది.

కొలువుకూటంలోకి తీసుకుపోయారామెను. ఎత్తైన సింహాసనం మీద విలువైన దుస్తుల్లో, నవరత్న ఖచితమైన కిరీటంతో, మణిమయ హారాలతో అవతరించిన శాంతిదేవతలా గంభీరంగా కూర్చొని ఉన్నాడు మహారాజు.

అతనికి ఇరువైపులా బారులు తీరి మంత్రి సామంతులు, ఉన్నతోద్యోగులు, కవులు, పండితులు ఆశీనులై వున్నారు. సభావేదికకు ఎదురుగా పురజనులు కూర్చొని ఉన్నారు.

ముసలమ్మ ఊహించినదంతా తారుమారైంది. ఆమెకు స్వాగతం పలికాడు మహారాజు. ముసలమ్మ రాజుకు వంగి నమస్కారం చేసి భయ భక్తులతో ఒక ప్రక్కగా ఒదిగి నుంచుంది. "ముసలమ్మా నేనెవరో గుర్తు పట్టావా?" అన్నాడు రాజు.

"మిమ్మల్ని గుర్తుపట్టడమేంటి మహారాజా? మీరు మమ్మల్ని ఏలే దొరలని లోకమంతా ఒప్పకుంటుంది? అంది ముసలమ్మ.

మహారాజు చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వు చేతి కంకణాలు కణకణ

మ్రోగినట్లుంది.

"రాజన్న నేనే" అన్నాడు రాజు. "నగరంలో ప్రజల జీవనం ఎలా ఉందో చూచి రావాలని మారు వేషంలో బయలుదేరినా నా పేరెలా మారుతుంది?"

ముసలమ్మ కళ్ళు ఆశ్చర్యంతో మెరిసిపోయాయి. ఆమె రాజుకేసి చూసింది. ఔను రాజన్న, మహారాజు వేషంలో ఉన్న రాజన్న. ఆ ముఖంలో తేజస్సు, భయంతో వణికిపోతూ "మా దొడ్డ దొరలు తప్పంటే మన్నించాలి" అంది.

"నువ్వు చేసిన పని తప్పు కాదు, నూటికి నూరు పాళ్ళు ఒప్పే. నీబోటి చల్లని మనిషి మా రాజ్యంలో ఉన్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది" అన్నాడు రాజు. అతడు సభాసదులకు నిన్న జరిగిన కథ అంతా చెప్పాడు. "ఈమె కథ వినగానే ఈమె మనసు చల్లముంత అని తెలుసు కున్నాను. ఈమె మీద నాకు దయ కలిగింది. రాచనగరులోకి తీసుకొచ్చి, మంచి బహుమానమిచ్చి పంపాలనుకున్నాను. కట్టెలు కోటలో వేస్తానని ఒప్పకుంది. కాని దారిలో కట్టెలు లేక అగచాట్లు పడుతున్న బీద ప్రజలకు కట్టెలన్నీ పంచిపెట్టేసింది. బహుమానం తనకు వద్దంది. మహారాజుతో చెప్పి నీ అంతు తేల్చేస్తానని బెదిరించినా భయపడలేదు. ప్రజల బ్రతుకే తన బ్రతుకన్నది. ఈ ముసలమ్మ త్యాగశీలాన్ని, దయాస్వభావాన్ని, ఉపకార బుద్ధిని చూచి అంతరంగం కరుణతో, గౌరవభావంతో, ఆనందంతో నిండి పోయింది. రాజ్యంలో ప్రతి మనిషి ఈమెలా నిష్కల్మషంగా, నిస్వార్థంగా ఉండాలని మా కోరిక. ఈ ముసలమ్మ మనస్సును బహుమానాలతో వెల కట్టలేకపోయినా మా ఆత్మతృప్తి కోసమైనా ఈమెను బహూకరించక తప్పదు" అంటూ వరహాలతో నిండిన వెండి పళ్ళెరాన్ని ఆమెకు అందివ్వ బోయాడు.

ఆమె స్వీకరించలేదు. "మహారాజా! ఇంత సిరి నేనేం చేసుకుంటాను?





ఊరు పొమ్మంటూంది, కాడు రమ్మంటూంది. ఈ వయస్సులో నా మామూలు బతుకే నాకెంతో తృప్తినిస్తుంది, ఆ తృప్తి చాలు.

"ముసలమ్మా నువ్వు మా తృప్తి కోసమన్నా తీసుకోక తప్పదు" అన్నాడు రాజు.

ముసలమ్మ అంది "మహారాజా మన్నించండి. మీకంత ఇష్టమైతే నేను కోరే బహుమానం ఇప్పిస్తారా?"

"ఏమడిగినా సరే" అన్నాడు రాజు.

"వరహాలు, అగ్రహారాలు నాకొద్దు ప్రభూ! కట్టెలమ్ముకునే వాళ్ళు నా బిడ్డలవంటివారు, నేనున్నంతవరకు వాళ్ళకు ముంత భయం లేదు. తరువాత ఆ లోటు తీర్చాల్సినవారు మీరే. అక్కడొక చలివేంద్రం వేయిం చండి. దప్పికతో నాలుకెండిపోయే తమ బిడ్డలకు దోసెడు నీళ్ళు పోయించండి. చల్లని తండ్రి అనిపించుకోండి" అంటూ నీరసంగా ఆగిపోయింది ముసలమ్మ.

మహారాజు ఆమె మాటలు విని ఆనందభాష్పాలు రాల్చాడు. ఆమె కోరిక తీరుస్తానని వాగ్దానం చేశాడు. ఊరు ఆమెను సాగనంపింది. అడవి రారమ్మని ఎలుగెత్తి పిలిచింది.

✡ ✡ ✡ ✡

వేసవికాలం వచ్చింది. మండుటెండలు లోకం పైన దండయాత్రలు ప్రారంభించాయి. పేదవాడి కాళ్ళు కాలిపోయి, నెత్తి మాడిపోయి, నాలుక ఎండిపోతుంది.

నేల తల్లీ, నింగిజేడూ చెలిమిచేసే తోటలో -

జిలుగు మబ్బుల పలకరించే నీలికొండల కోటలో

ప్రకృతి దాచుకున్న సిరులపెట్టె ఆ చిట్టడవిలో మళ్ళీ లయ తప్పకుండా గొడ్డళ్ళు చేసే చప్పుళ్ళు వినవస్తున్నాయి. ఎండలో మెరుస్తున్న రాముడు- కట్టెల మోపు తలపైన పెట్టుకున్నాడు. గొడ్డలిమోపులో దోపుకున్నాడు. ఒక

చేతిలో మోపును బట్టుకుని మరో చేతిని ఊపుకుంటూ గబగబ నడక సాగించాడు. ఆ చేతిలో ఇప్పుడు కట్టె లేదు.

అతడు అడవి దాటుకున్నాడు. కొండమలుపు తిరిగాడు. నేరేడుచెట్ల నీడలోకి వచ్చాడు. మోపు చెట్టుకు ఆనించాడు.

అక్కడ ముసలమ్మ పర్ణశాల లేదు. ఆ చోట ఒక పెద్ద సమాధి ఉంది. ఆ సమాధిపైన నాలుగు స్తంభాల రాతి మంటపం ఉంది. ఆ మంటపం క్రింద నీడలో నాలుగు కొత్త కడవలు వాటి దగ్గర ఒక మనిషి ఉన్నాడు.

రాముడు నుదుటిమీద చెమట తుడుచుకున్నాడు. మంచినీళ్ల ముంత అందుకుంటూ చల్లని తల్లి చచ్చి ఏ లోకాన ఉందో? అనుకున్నాడు. నీళ్ళు త్రాగాడు. నీళ్ళు చల్లగా ఉన్నవి. అతడి దాహం తీరింది. ముసలమ్మ చావలేదు. నీటిలోని చల్లదనమే ముసలమ్మ. నీళ్లలో చల్లదనమున్నంత కాలం ముసలమ్మ బ్రతికే ఉంటుంది అనుకున్నాడు. మోపు తలపైన పెట్టుకున్నాడు. ఆ సన్నటి కొండబాటలో నగరం వైపుగా సాగిపోయాడు.

మామిడిచెట్లో కోయిల తన తీయని గొంతెత్తి, అతనికి వినిపించేలా గట్టిగా ఇలా పాడుతోంది.

“నా గొంతులో తేనెవాగు సృష్టించి,
నా కూతలో రాగమాలికలు నించి,
కథలేవో పాడుమని నిధి నన్ను బలపె;
గాథ నీదే తల్లి - నీ గళము నింపె
నీ మంచి మనసు తెలినీటి కోనేరు
నీ మనసులో మమత కోనేటి నీరు
నీ మూర్తి పుడమిపై నేడు కనరాదు
నీ మమత కేనాడు మరణమే లేదు
పాటగా నీ గాథ పాడి వినిపింతు!
పాటలో నీ కీర్తి సుధలు గురిపింతు
కుహూకుహూ కుహూకుహూ
కుహూకుహూ కుహూకుహూ ................?





# వృద్ధాశ్రమం

సాయిధామం ఆశ్రమంలో **“సంధ్య”** పేరిట ఒక అరక్షిత (దిక్కు లేని వారి) వృద్ధాశ్రమం నడుస్తున్నది. సంతతి లేక, ఏ ఆధారము లేని వృద్ధ స్త్రీ, పురుషులకు (నారాయణి, నారాయణ) ఇక్కడ అవకాశం ఉన్నది. వీరికి భోజనం, వైద్యం, వస్త్రం అన్నీ ఆశ్రమమే ఉచితంగా సమకూరుస్తుంది. ఇలాంటి అవసరం ఉన్న వృద్ధులు దిగువ ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

1. వయస్సు 55-70 సం.ల మధ్య ఉండాలి.
2. ఆశ్రమ నియమాలకు వీరు కట్టుబడి ఉండాలి. (దైవచింతన, కలిసి మెలసి ఉండటం వంటివి)
3. వారి పనులు వారు చేసుకోగలిగే స్థితిలో ఉండాలి.
4. సిగరెట్టు, గుట్కా, త్రాగుడు వంటి అలవాట్లు ఉండకూడదు.
5. ఆరోగ్యం బాగున్నంత వరకు సత్సంగాలలో పాల్గొంటూ ఉండాలి.
6. వారిని చేర్చేవారు స్వయంగా వచ్చి సంప్రదించి చేర్చి, అప్లికేషన్ ఫారం మీద సంతకం చేయాలి.

ప్రస్తుతం 10 మందికి స్త్రీల విభాగంలోనూ, 10 మంది పురుషుల విభాగం లోనూ ఖాళీలు ఉన్నాయి. సాయిభక్తులు ఈ అవకాశం ఉన్న వృద్ధులకు సహకరించి చిరునామా వివరించగలరు.

**- సాయిధామం**

**ఫోన్స్ : 9440413455, 9848133565**

(ఆశ్రమం కీసరకు 6 కి.మీ. దూరంగా వుంది. హైదరాబాద్‌కు 33 కి.మీ, ఇ.సి.ఐ.యల్. చౌరస్తాకు 18 కి.మీ దూరంలో ఉంది. సికింద్రాబాద్ స్టేషన్ దగ్గర గల బస్టాప్ నుంచి ఇ.సి.ఐ.యల్. చౌరస్తా నుంచి వచ్చే బస్సులు ఇటు వస్తాయి. బస్టాపు పేరు సాయిధామం. తుర్కపల్లి, హాజీపూర్, చీకటిమామిడి, ఉద్ధమర్రి, లక్ష్మాపూర్ వగైరా బస్సులు)

సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

(గత సంచిక తరువాయి)

## సాయి బావని

అవధూత చింతన శ్రీ గురుదేవ దత్త

జయ ఈశ్వర జయ సాయి దయాళ
తూహీ జగత్‌కా పాలనహార్ ॥ 1
దత్త దిగంబర ప్రభు అవతార్
తేరే బస్ మే సబ్ సంసార్ ॥ 2
బ్రహ్మాచ్యుత శంకర అవతార్
శరణాగతకా ప్రాణాధార్ ॥ 3
దర్శన్ దేదో ప్రభు మేరే
మిటాదో చౌరాసీ ఫేరే ॥ 4
కఫనీ తేరే ఇక సాయీ
ఝోలీ కాంధే లటకాయా ॥ 5
నీమ్‌తలే తూ ప్రకటగయా
ఫకీర్ బన్‌కే తూ ఆయా ॥ 6
కలియుగమే అవతార్ లియా
పతిత పావన తూనె కియా ॥ 7
షిరిడీ గాంప్ మే వాస కియా
లోగోంకే మన్ లుభాలియా ॥ 8
చిలంఖీ శోభా హాథోంకీ
బన్సీజైసీ మోహన్‌కీ ॥ 9





దయా భరిథీ ఆంఖోమే
అమృత ధారా బాతోమే ॥ 10
ధన్య ద్వారకా వో మాయి
సమాగమే జహాఁ సాయి ॥ 11
జల్ జాతా హై పాప వహాఁ
బాబాకీ హై ధునీ జహాఁ ॥ 12
భూలా భటకా మై అంజాన్
దే ముఝుకో తేరా వరదాన్ ॥ 13
కరుణా సింధు ప్రభు మేరే
లాఖోం బైఠే దరపే తేరే ॥ 14
అగ్నిహోత్రి శాస్త్రీకో
చమత్కార్ తూనె దిఖలాయా ॥ 15
జీవనదాన శామా పాయా
జహర్ సాంప్‌కా ఉతరాయా ॥ 16
ప్రళయకాల్‌కో రోక్‌లియా
భక్తోంకో భయ్ ముక్త్ కియా ॥ 17
మహామారీ బేనామ్ కియా
షిరిడీ పురికో బచాలియా ॥ 18
ప్రణామ్ తుఝుకో మేరే ఈశ
చరణోమే తేరే మేరా శీష ॥ 19
మనకీ ఆస్ పూరీ కరో
భవ సాగర్ సే పార్ కరో ॥ 20
భక్త్ భీమాజీ థా బీమార్
కర్‌బైఠా థా సౌ ఉపచార్ 21
ధన్య సాయికీ పవిత్ర ఊదీ

మిట్‌గయా ఉస్‌కీ క్షయ వ్యాధీ ॥ 22
దిఖలాయా తూనే విఠల్ రూప్
కాకాజీ కో స్వయం స్వరూప్ ॥ 23
దామూకో సంతాన దియా
మన్ ఉసకా సంతుష్ట కియా ॥ 24
కృపానిధీ అబ్ కృపాకరో
దీన దయాళూ దయా కరో ॥ 25
తన్, ధన్, మన్ అర్పణ తుఝుకో
దేదో సద్గతి ప్రభు ముఝుకో ॥ 26
మేఘా తుఝుకో న జానా థా
ముస్లిం తుఝుకో మానా థా ॥ 27
స్వయంతూ బన్‌కే శివ శంకర్
బనాదియా ఉస్కో కీకర్ ॥ 28
రోశనాయికీ చిరాగోంసే
తేల్‌కే బదలే పానీసే ॥ 29
జిసనే దేఖా ఆంఖో హాల్
హాల్ హువా ఉస్కా బేహాల్ ॥ 30
చాంద్ భాయి థా ఉలఝున్ మే
ఘేడేకే కారణ మన్‌మే ॥ 31
సాయినీ కీ ఐసీ కృపా
ఘెడా ఫిర్‌సె వహ పాసకా ॥ 32
శ్రద్ధా సబూరీ మనమే రఖో
సాయి సాయి నామ్ రటో ॥ 33
పూరీ హెూగీ మన్‌కీ ఆస్
కర్‌లో సాయి కా నిజధ్యాన్ ॥ 34

**(సశేషం)**





**శ్రీ కృష్ణావతారం**

# శాశ్వత ధర్మగోప్త



**- రచన : భండారు సదాశివరావుగారు**

**(గత సంచిక తరువాయి)**

'నిజం కదూ! అందుకే ఆయనను మీ మాటలతో, చేతలతో పరాభవించారు.

'సరే. ఇంతకూ వారేమంటున్నారు?'

'కృష్ణ, కృష్ణ అని జపిస్తున్నారు. అయినా రెండు, మూడు రోజుల వరకు వారి బంధువుల రాకకోసం చూడాలి కదా ప్రభూ! ఆ ఆర్తులను చూస్తే మనస్సులు కుదుటపడతవేమో. అన్ని ఉద్రేకాలూ ఉడిగి, ఆ ఆఖరు క్షణంలో, ఆలంబనం కోసం తపిస్తున్నారు. కన్నీళ్ళు ఉండిపోయి చెక్కిళ్ళ చారికలు మిగిలాయి'.

'అయినా, వారి బంధువులను ఎక్కడని వెదుకగలం! నరకుని బాధలకు విసిగి ఎందరో తమతమ స్వస్థలాలను విడిచి వెళ్ళిపోయినారట! భూదేవి జోక్యంతో తను వారిని చూడడానికి అనుమతించినా, ఏ కొద్ది మందో రావడానికి సాహసిస్తుండేవారని విన్నాను'.

'ఒక వారమైనా వేచి చూడాలి కదా స్వామీ!'

'ఈలోగా భగదత్తుణ్ణి అభిషేకింపజేయాలి. అతని రాజ్యానికి ఒక మంత్రినీ, ఒక పురోహితుణ్ణి ఏర్పరచుకోమని చెప్పాలి. అతడు జరాసంధ కూటమిలో చేరకుండా చిత్రవాహన మహారాజుకూ, అతనికీ సంధి చేయించాలి'.

తూరుపున క్రమంగా చీకట్లు విచ్చుకునే వరకు వారిద్దరికీ కునుకు లేదు. అసమక్షేత్రం రకరకాల ఉపాసనలకు నిలయం. శాక్తేయ, పాశుపతులు, శ్రోత్రియులు, అఘోర సాంప్రదాయ దీక్షితులు, కాపాలికులు - ఇంకా ఎందరో. నరకుడు వామాచార దీక్షితుడు, స్త్రీని స్థూలమైన కామకేళి

విలాసినిగా చూచేవాడు. అతని దుర్వ్యవహారానికి ఎందుకు స్త్రీలు బలి ఐనారో! ఏ స్త్రీ తనకు జరిగిన అవమానాన్ని నలుగురిలో చెప్పగలుగుతుంది! మరునాడు అమావాస్య. ఆ పదారువేల నూర్గురు తమకు ముక్తిని ప్రసాదించిన శ్రీకృష్ణ పరమాత్మకు భక్తితో దీపాలు వెలిగించి లోహితనదిలో ప్రమిదలను వదిలారు. ఆ వెలుగులకు వారందరి ముఖాలు వెలిగిపోయినాయి. సత్య కన్నులు ఆ దృశ్యానికి చెమర్చాయి.

కార్తీక పాడ్యమి రోజున అక్రూర, ఉద్ధవులిద్దరూ ఆ స్త్రీల నిమిత్తం సిద్ధమైన ఆహారాన్ని అందులో ప్రౌఢలైన స్త్రీలు పెట్టగా, భగినీహస్త భోజనంగా తిని వారిని ఆశీర్వదించారు. చతుర్దశి నుండి ఆనాటి వరకు వారికి స్వామి తమ త్రాత-శ్రీకృష్ణ వాసుదేవుని దర్శనం లభించలేదు.

'వారిని మీరు మీ హృదయాలలో ప్రతిష్ఠించుకోవాలమ్మా! మీ గుండెల్లోనే ఆయనను దర్శించుకోవాలి. ప్రతిఫలం ఏమి కోరినా స్వామి అనుగ్రహం లభించదు. ఆయన తలపెట్టిన మంచిపనులలో ఒక పరికరంగా మనను మనం అర్పించుకుంటేనే ఆయనను చేరుకో గలుగుతాం!' అక్రూరుడు ఆర్ద్రంగా అన్నారు. 'ఎక్కడ-ద్వారక! అక్కడి నుంచి సత్యభామా సమేతుడై వచ్చి నరకుణ్ణి సంహరించడమే అద్భుతకార్యం కదమ్మా! ఆ దేవుని ముందు నరకుని రాక్షసమాయలు విఫలం కాలేదా' రాధను ఆనంద శాశ్వతదేవతగా ప్రతిష్ఠించిన అమృతమూర్తి ఆయన! 'కుబ్జను సువర్ణశలాకగా మార్చాడు. గోప, గోపీ జనమనోవల్లభుడై వాళ్ళ జీవనశ్వాస అయినాడు. పంచజనులపహరించిన గురుపుత్రుణ్ణి తిరిగి తెచ్చాడు. ఆయనను ఎంతగా పూజిస్తే అంతగా మనకు తన హృదయంలో చోటిస్తాడు' అన్నాడు ఉద్ధవుడు.

ఆ రోజు భగదత్తునికి యథావిధిగా రాజుగా అభిషేకం జరిగింది. పురోహితుని ధర్మ దండాన్ని పూర్వపు పురోహితునికి భగదత్తుడందించాడు. నరకుని ఏలుబడిలో విచ్చలవిడిగా వ్యవహరించిన వారిని హెచ్చరించి వదలిపెట్టారు. చిత్రవాహనుడు, త్రివిష్టపాధిపతి, శ్రీకృష్ణుడు భగదత్తుని రాజ్యం సుభిక్షంగా, ప్రజానురంజకంగా, ధర్మానుకూలంగా నడవాలని






అభిలషించారు.

నరకుని మృతి ప్రాగ్జోతిష నగర ప్రజల మీదే కాక ప్రాగ్దేశంలో ప్రతి గ్రామం దాకా శ్రీకృష్ణుని మహాద్భుత లీలగా, ప్రజలలోకి ప్రాకిపోయింది. శ్రీకృష్ణ దర్శనార్థం జనం అశేషంగా రానారంభించారు. నరకుని మరణంతో, దిగ్బంధాలు, నిర్బంధాలు తొలగిపోయాయి. బల్లకట్లు రెండూ పగలల్లా రాకపోకలకు ఉపయోగించడం మొదలైంది. ప్రజలలో ఒక విధమైన ధైర్యం కన్పిస్తున్నది.

అలా వారం గడిచింది. అంతవరకు శ్రీకృష్ణుడు స్వయంగా చెర నుంచి విముక్తులైన ఆ నారీమణులను చూడలేదు. ఆ ఆర్తత్రాతను దర్శించుకోవాలనే తపన వాళ్ళలో పెరిగి పెరిగి చివరికి సత్యభామతో మొరపెట్టుకున్నారు.

'మహాదేవీ! మేము శిథిల కంకాళాలము! మాలో ఆశ లేదు. నిరాశ లేదు. చావు రాక, చావు లేక బ్రతుకుతున్న దుర్భర జీవితం మాది. ఈ చెరలో ప్రవేశించిన తరువాత నేటికీ నీ పలకరింపుల చల్లదనంతో తేరుకున్నామమ్మా! మాకు భోగభాగ్యాలు వద్దు. మా బంధువులూ, కావలసిన వాళ్ళూ తిరిగి మమ్మల్ని తీసుకొనిపోవడానికి రారు. మేము నిరాశ్రితులం. మాకు కృష్ణస్వామి తప్ప మరో దిక్కు లేదు. కృష్ణ స్మరణ తప్ప మరో స్మరణ లేదు. మమ్మల్ని ఆయనే రక్షించాలి. ఆయన మమ్మల్ని అనుగ్రహించి, మా ఆర్తిని తీర్చాలి. మా భారాన్ని ఆయనే భరించాలి తల్లీ!' అని విలవిలలాడారు. వారి నిస్సహాయస్తితి సత్యభామ హృదయాన్ని కరిగించింది. అన్ని ఆశలు ఉడిగిన గజేంద్రుని మొర విన్న ప్రభువుకు ఈ దీనురాండ్ర మొర వినపడదా?

ఆ పదహారు వేల నూరు మంది గొంతుక లొక్కటై తమ గుండెలోతుల్లోంచి మొరపెట్టుకున్నట్లైంది. 'అమ్మా! మాకు ఈ సంసారమోహం లేదు తల్లీ! చివికి జీర్ణించిన ఈ శరీరాలు కృష్ణ స్మరణతో చివురించి మాకు సద్గతి కల్గిస్తే చాలు. వాసుదేవ నామమే మాకు సేదదీర్చే నామ రసాయనం' అని సగం తల నెరసిన ఒక ఆర్తురాలు వాపోయింది. **(సశేషం)**



# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిషోర్

**(గత సంచిక తరువాయి)**

అంతే కాదు, తన జీవన పర్యంతం తాను ఈ అభిప్రాయానికే కట్టుబడి, తనకు ఫలానా ఇహపరమైన కోరిక తీర్చమని బాబాను ఎన్నడూ ప్రార్థించ లేదు. ఫౌజ్‌దార్ పదవిని ఆశ్రయించాలనే ఆశ హృదయమంతా నిండి యున్నా, బాబా ఉద్యోగాన్ని వదలి వేయమని వత్తిడి చేస్తున్న నేపథ్యంలో - తన స్వశక్తితో, సమర్థతతో ఆ పదవి తనను వరించాలని కోరుకున్నాడు కానీ, తనకు ఆ పదోన్నతి ప్రసాదించమని బాబాను ఎన్నడూ అడగలేదు. అంతెందుకు, తన భార్య శ్రీమతి సరస్వతీ బాయి మతిభ్రమణంతో జీవన పర్యంతం బాధపడినా, తనకు స్వస్థత చేకూర్చమని బాబాను ఎన్నడూ అర్థించలేదు. సాక్షాత్కారం కావాలని, అద్భుతమైన పారమార్థిక పరిజ్ఞానం కావాలని బాబాను ప్రార్థించాడు కానీ, ఐహిక విషయాలకు సంబంధించి ఎన్నడూ ఏదీ బాబా వద్ద నుండి ఆశించలేదు. ఐహిక శ్రేయస్సును వీడి, పారమార్థిక శ్రేయస్సు కోసమే మహాత్ములను ఆశ్రయించాలనే భావం తనలో ఎంతగా బలపడి యుందంటే, అలా ఇంకెవరయినా ఆశ్రయించినా తాను నిర్ద్వంద్వంగా నిరసించేవాడు. తన అసంతృప్తిని బాహాటంగానే వ్యక్తపరచేవాడు. ఒక చిన్న ఉదాహరణ ...

1948వ సంవత్సరంలో డిసెంబరు మాసంలో కోయంబత్తూరులో ప్రముఖ సాయి చరిత్రకారుడు శ్రీ బి.వి. నరసింహస్వామి ఆధ్వర్యంలో అఖిల భారతీయ సాయి భక్త సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ దాసగణు మహారాజ్ హాజరయ్యారు. శ్రీ బి.వి. నరసింహాస్వామి గారి రచనల ద్వారా, ఉపన్యాసాల ద్వారా బాబాతో దాసగణుకున్న సాన్నిహిత్యాన్ని తెలుసుకున్న భక్తులు అపూర్వమైన రీతిలో





దాసగణుకి స్వాగత సత్కారాలు ఏర్పాటు చేసారు. అంతేకాదు, ఆయనను దర్శించి, పాదాలకు నమస్కరించేందుకు బారులు తీరారు. ప్రతి ఒక్కరు దాసగణు వద్దకు వచ్చి, ఆయనకు పాదాభివందనం చేసి, సహజంగానే తమ ప్రాపంచిక కోరికలను, బాధలను వెల్లడించుకున్నారు. దాసగణు వారందరికీ “బాబా పట్ల శ్రద్ధ కలిగియుండండి”, “నామస్మరణ చేసుకోండి” అని చెప్పారు. కానీ, తరువాత అలా అందరూ వచ్చి తన వద్ద అలా ప్రాపంచిక కోరికలను ప్రస్తావించడం పట్ల శ్రీ బి.వి. నరసింహస్వామి వద్ద తన అసంతృప్తిని వ్యక్తపరిచారు. దీనినిబట్టి దాసగణు యొక్క విలక్షణ మైన మనోగతాన్ని మనం అర్థం చేసుకోవచ్చు.

దాసగణులోనున్న ఇంకొక విశిష్టమైన గుణం ఏమిటంటే, భగవంతుని ఆడంబరంగా ఆరాధించడం తనకు నచ్చదు. భగవంతుడు భక్తుల వద్ద నుండి ఆశించేది కేవలం స్వచ్ఛమైన భక్తి ప్రేమలని, ఆడంబర ఉపచారాల రూపంలో చేసే డంబాచారాలు భగవంతునికి అవసరం లేదనేది తన అభిమతంగా ఉండేది. బాబా పట్ల కూడా తాను అదే భావాన్ని కలిగి యుండేవాడు. సాక్షాత్తూ ఆ భగవంతుడే అతి నిరాడంబరమైన ఫకీరుగా ప్రకటమై బాబా రూపంలో నడయాడుతున్నారని, కనుక బాబా వద్ద అటువంటి ఆడంబరతకు చోటులేదని సహచర భక్తుల వద్ద కుండబద్దలు కొట్టినట్లుగా తన అభిప్రాయాన్ని వినిపించేవారు. హార్దాకు చెందిన కొందరు భక్తులు బాబాకు పల్లకీని సమర్పించడం చూసి, అటువంటి ఆడంబరతకు బలవంతంగా బాబాకు రుద్దుతున్నందుకు దాసగణు తీవ్రంగా మండిపడి కేకలువేసారని శ్రీ రఘువీర్ భాస్కర్ పురంధరే తమ స్మృతులలో చెపుతారు. భక్తులు ఎంతో విలువైన ఆడంబర సామాగ్రిని సమర్పించినా సరే, బాబా ఎన్నడూ వాటిని ఉపయోగించక, వాటి పట్ల ప్రదర్శించే నిర్లిప్తతను తన వాదనకు సాక్ష్యంగా, ఉదాహరణగా దాసగణు చూపేవారు. దీనిని బట్టి పై విషయం పట్ల దాసగణు ఎంత ఖచ్చితమైన అభిప్రాయం కలిగియుండేవారో మనం సులభంగానే ఊహించవచ్చు. **(సశేషం)**



# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము
## భక్తి పద్య కావ్యము

రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

### 12. బహుళ కష్టతరము భక్తిబాట

ఆ.వె. మనసు తిరము లేక మర్కటమదియౌను
కొమ్మ కొమ్మలందు యూగుచుండు
కుదురు గలుగ గలదు గురుని స్పర్శవలన
గురుని హృదిన జేర్చి గుడిని గట్టు. 1

ఆ.వె. అహము వీడగానె యర్హత గలుగును
భావమొండులేని భక్తుడవగ
సాధనొండు లేక సాధించవీలగు
సాయి తత్త్వమిదియ సఫల జన్మ. 2

ఆ.వె. జ్ఞాన, భక్తి, యోగ, కర్మ మార్గములందు
బహుళ కష్టతరము భక్తిబాట
గుంట-మిట్టలందు గురుని యండవలయు
గురుని గొలువు మోయి గురిగ నీవు. 3

ఆ.వె. కంటకముల తోడి నిండియుండెడి బాట
కరుణ లేక గురుని కదుల లేవు
బహుయగాధ భరిత భక్తిబాటను దాట
గురుని పథము విడక గురిగ నడుపు. 4

కం. చింతన జేయుదు నిరతము
సంతసమున గొల్చువారి సకలము దీర్తున్





చెంతన జేర్చుదు భక్తుల
అంతమునన్ వారు నొంద నాముష్మికమున్. 5

ఆ.వె. నాదు భక్తులింట నానివాసముగల్గు
అన్న-వస్త్రములకు అలవకుండ
సరిగ గూర్చుదు నని-సాయిమా పలికెను
వారి నుద్ధరింతు-వార్ధి దాట. 6

ఆ.వె. సక్తులయిన యెడల సంసారబంధాల
చేర లేరు సాయి చెంత మీరు
మనసు యుగ్గబట్టి మార్గంబు గనుగొని
సాయి పథము బట్టి సాగ వలయు. 7

ఆ.వె. విశ్వసించు మోయి విశ్వాత్మ సాయీశు
విశ్వ గురుడు జేర్చు విడక నిన్ను
బంధముక్తు జేసి పాపాలు పోగొట్టి
పరమశివుని కడకు పరముకొఱకు. 8

ఆ.వె. కొడుకు కలిగెనంట గోపాలరావుకు
దాము అణ్ణకున్న దయను నీదు
వారి మనసు అందు వార్తను కలిగించ
ఉరుసు రామనవమి ఉత్సవాలు. 9

ఆ.వె. రెండు ఉత్సవములు-లేని పోట్లాటలు
హిందు ముస్లిములును-హింస వీడి
కలిసి చేసి రచట కాంతులు జిమ్మంగ
సాయి మహిమ గాదె సఖ్యతకును. 10

(సశేషం)

# మాతృసంస్థ కబుర్లు

ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజును గురుపూర్ణిమ అనీ, వ్యాసపూర్ణిమ అనీ అంటారు. అద్వితీయమైన గురు పరంపరలకు ఆలవాలం మన భారత దేశం. గురువును బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా పూజించే ఉత్కృష్టమైన సంస్కృతి మనది. తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుకే ఇవ్వబడినది. గురు పౌర్ణమి పరమ పవిత్రమైనదిగా జరుపుకుంటారు.

ఈ సంవత్సరం గురుపౌర్ణమి జులై 13వ తేదీన వచ్చింది. సాయిధామం ఆశ్రమంలో ద్వారవతి సాయినాథ దేవాలయానికి భక్తులు వేల సంఖ్యలో వచ్చి బాబా వారిని, పూజ్య గురుదేవులను దర్శించుకున్నారు. భక్తులు వేల సంఖ్యలో వస్తారని, కావలసిన ఏర్పాట్లు నెల ముందు నుంచే జరుగు తుంటాయి. దేవాలయాలు శుభ్రం చేయడం, వంట సామాను, సరుకులు, అలంకరణ సామాగ్రిలు తేవడం మొదలైనవి సిద్ధమైపోతాయి. కానీ, ఈసారి బాబా వారు పెద్ద పరీక్ష పెట్టారు. గురుపూర్ణిమకు నాలుగు రోజుల ముందు నుంచి విపరీతమైన కుండపోత వాన. వాతావరణ ప్రభావం వలన ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. ఈ ఎడతెరిపి లేని వానలో భక్తులు ఎంతమంది వస్తారు.. అసలు వస్తారా... రారా అన్న సందేహం, కార్యక్రమం ఎలా చేయాలి అన్న ఆలోచన మరో ప్రక్క. అంతా భగవత్సంకల్పం. ఆ వర్షంలోనే తడుస్తూ అన్ని పనులను ఆశ్రమం పిల్లలు, పెద్దలు, ఉపాధ్యాయులు అంతా చకాచకా చేసేసారు. దేవాలయాలలో పూలాలంకరణ ఎంతో సుందరంగా అలంకరించారు. సాయినాథుల వారి





సుందరరూపం కాంతులు చిందుతూ ఉంది.

13వ తేదీ ఉదయం 5.15 ని.లకు కాకడ హారతి అనంతరం గం.6.00లకు సాయినాథుల వారికి క్షీరాభిషేకం, జలాభిషేకం, నమకం, చమకం, రుద్రం, సాయినామాలతో సాగినాయి. గం.7.30లకు ప్రధాన పూజ ప్రత్యేక అలంకరణతో. గం.7లకు పూజ్య గురుదేవులు అయిన శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారికి క్షీరాభిషేకం, జలాభిషేకం, ప్రత్యేక పూజ జరిగాయి. ఈ అభిషేక కార్యక్రమంలో భక్తులు ఎంతో భక్తిప్రపత్తులతో స్వయంగా బాబా వారే అక్కడ ఆశీనులైనారు అనే భావనతో తన్మయత్వం చెందారు.

గం.10.30లకు సాయినాథుల వారికి సహస్రనామలతో పుష్పార్చనా కార్యక్రమం, బయట జోరున వాన. వానని సైతం లెక్కచేయకుండా దేవాలయం నిండా భక్త జనులు బాబా వారికి జరిగే సహస్ర నామార్చనను కనులారా వీక్షించాలనీ, ఆయన కరుణాకటాక్షాలకు నోచుకోవాలనీ దూర తీరాల నుండి తరలివచ్చారు. “ఎవరు అదృష్టవంతులో వారు నా పూజ చేసుకుంటారు” అని బాబా చెప్పారు కదా.

సహస్ర నామార్చనకు వన్నెవన్నెల పుష్పాలను బుట్టల నిండా నింపి సిద్ధం చేసినారు. సాయిదత్త పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు విచ్చేయడంతో పూజ మొదలయింది. స్వామివారు సహస్ర నామాలు చదువుతుంటే భక్తులంతా ఓంకార నాదంతో దేవాలయం ప్రతి ధ్వనించింది. ఎన్నో వర్ణాల పుష్పాలతో సాయినాథుల వారు కొలువుదీరారు.

అనంతరం పూజ్య గురుదేవులకు పాదుకాపూజా కార్యక్రమం. శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీ రామానంద ప్రభుజీవారు గురువు యొక్క విశిష్టతను వివరిస్తు

న్నారు. మనలో అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞానజ్యోతులను వెలిగించువాడే గురువు. ఈ పర్వదినాన వారి పాదపూజ చేసుకోవడం మన అదృష్టం. బియ్యంతో నామజపం చేసుకొని ఆ బియ్యం భగవంతుడికి సమర్పించి గురు పాదుకాపూజకు ఆశీనులయినారు కొంతమంది భక్తులు.

రామరావణ కాలంలో శ్రీరామచంద్రుడు ఒక రావణాసురుడితోనే ఎన్నో ఆటంకాలను ఎదుర్కొని రావణసంహారం చేసాడు. అంతా మంచిగా జరుగుతుంటే చూడలేని దుష్కర దుర్మార్గులు కొందరు విఘ్నాలు కలిగిస్తుంటారు. అందునా ఇది కలికాలం. మంచికి సహకరించే వారికన్నా అధర్మానికి సహకరించేవారే ఎక్కువగా ఉన్నారు. స్వామీజీ పాదుకాపూజ మొదలుపెట్టబోతుండగా పక్కా పథకం ప్రకారం వారిని హత్యా ప్రయత్నం చేయాలనే బెల్లంకొండ కృష్ణమూర్తి, విజయలక్ష్మి, పుట్టగుంట బాబు సుధాకరరావు, మల్లారెడ్డి మూకుమ్మడిగా స్వామీజీ దగ్గరకు వచ్చి, కృష్ణమూర్తి గురువుగారి గొంతు పట్టుకున్నాడు. వందలమంది జనం స్వామీజీ ప్రవచనం వింటుండగా యీ సంఘటన చోటుచేసుకుంది. వెంటనే భక్తులు, ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు స్వామీజీకి రక్షణ కవచంగా నిలిచారు. ఫోన్ నెం.100కి డయల్ చేయగా పోలీసులు వచ్చి నిర్ణయించింది ఏమిటంటే పూజలు నిలిపివేయాలని స్వామీజీని ఆదేశించారు. అసలు దాడిచేసిన వ్యక్తులను పట్టించుకోకుండా గురు పూర్ణిమ వేడుకలు నిలిపివేయాలని పోలీసులు ఆదేశాలివ్వడం భక్తులకు విస్మయానికి గురి చేశాయి. సాయిధామానికి పూర్వవైభవం తేవాలని ఉపన్యాసాలిచ్చే ఈ దుర్మార్గులు గురుపీఠాన్ని అవమానించారు. దైవకార్యాన్ని నాశనం చేసారు. మరి భగవంతుడు వీళ్లకు ఎలాంటి శిక్ష వేస్తాడో చూడాలి.





శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీరామానంద ప్రభుజీ ఉష భవన సముదాయానికి విచ్చేయగానే భక్తులంతా వారితోపాటే అక్కడికి వచ్చి వారి ప్రవచనం విని, గురు సంకీర్తనం చేసుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించి తరలివెళ్ళారు.

ఈ కార్యక్రమంలో ఆర్థికంగా, హార్థికంగా సహకరించిన భక్తులందరికీ శ్రీ సాయినాథుల వారి ఆశీస్సులు ఎల్లవేళలా మీ వెన్నంటి ఉండాలని సాయివాణి మనసారా వేడుకుంటుంది.

## శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రమం-సత్తెనపల్లి శాఖ

జులై 10వ తేదీ తొలి ఏకాదశి సందర్భంగా సీతా, లక్ష్మణ, హనుమత్సమేత శ్రీ కోదండ రాముల వారికి క్షీరాభిషేక, జలాభిషేకాలు, అనంతరం సహస్ర నామార్చన, పూజా కార్యక్రమం జరిగినది. ఆనంద సాయి ప్రభు వారికి క్షీరాభిషేక, జలాభిషేకాలు, పూజా కార్యక్రమం జరిగినది. భక్తులు స్వామి వార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించి తరించారు.

జులై 13వ తేదీ గురుపౌర్ణమి సందర్భంగా ఆనంద సాయి ప్రభు వారికి, పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారికి పంచామృత, క్షీరాభిషేక, జలాభిషేకాలు జరిగినవి. భక్తులు సాయినాథుల వారికి, పరమపూజ్య గురుదేవులకు అభిషేకం చేసి తరించారు. అనంతరం నూతన వస్త్రధారులై, పూలమాలాలంకృతులైన బాబా వారిని, గురుదేవులను దర్శించి తరించారు. అనంతరం ఆనంద సాయి ప్రభు వారికి సహస్ర నామార్చన, పూజా కార్యక్రమం, పరమ పూజ్య గురుదేవులకు అష్టోత్తర శతనామ పూజ జరిగినది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరూ ఆనందోత్సాహాలతో, భక్తి ప్రపత్తులతో బాబా వారి పూజా కార్యక్రమం తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించి ధన్యులయ్యారు.